# 51 మంది రైతులకు రూ.17.09 కోట్ల పరిహారం బిల్లులు విడుదల మంత్రి డా. పెమ్మసాని



**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్, 29,**
గుంటూరు ఛానల్ ఎక్స్‌టెన్షన్ కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందించే ప్రక్రియలో మరో ముందడుగు పడిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.4వ విడతలో భాగంగా 51 మంది రైతులకు రూ.17.09 కోట్ల విలువైన 5 సీఎఫ్ఎంఎస్ బిల్లులు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. గరపాడు, ప్రత్తిపాడు, మల్లాయపాలెం, కొండేపాడు, రావిపాడు గ్రామాలకు చెందిన రైతులకు ఈ పరిహారం అందనుంది.
ఇక మిగిలిన సుమారు రూ.14 కోట్ల పరిహారం కూడా త్వరలో విడుదల చేసేలా చర్యలు తీసుకుంటున్నామని డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. భూములు ఇచ్చిన ప్రతి రైతుకు రావాల్సిన పరిహారం అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తున్నామని చెప్పారు.రైతుల సహకారంతో చేపడుతున్న గుంటూరు ఛానల్ ఎక్స్‌టెన్షన్ ఫేజ్1 పనులను ముందుకు తీసుకెళ్లడంతో పాటు, పెండింగ్ పరిహారాలను సకాలంలో అందించేందుకు చర్యలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన దళిత ఉద్యమ నాయకురాలు,జయసుధ



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 29,**
జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏపీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి ఆమెకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కైలా జయసుధ మీడియాతో మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ అధినేత, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ద్వారానే దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం సాధ్యం అవుతుందని, కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని చెప్పారు.నా మీద నమ్మకంతో కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరికిధన్యవాదములు తెలుపుతున్నాను.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నా వంతు కృషిగా శక్తి వంచన లేకుండా పనిచేస్తానని హామీ ఇచ్చారు.కూటమి నాయకులు చేసే తప్పులను ఎప్పటికప్పుడు ఎత్తి చూపుతు, వారు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ పార్టీ నుండి ప్రజల పక్షాన ప్రశ్నిస్తానని చెప్పారు.ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేవరకు ఉద్యమాలు, పోరాటాలు చేయటానికి సిద్ధంగా ఉన్నానని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

## ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్3 పనులు వేగవంతం మంత్రి డా. పెమ్మసాని





**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్, 29,**
నగర పరిధిలోని శిల్పారామం నుంచి పెదపలకలూరు వరకు చేపడుతున్న మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్3 పనులను వేగంగా పూర్తి చేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.శనివారం స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, నాయకులతో కలిసి ఇన్నర్ రింగ్ రోడ్ పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. శిల్పారామం నుంచి పెదపలకలూరు వరకు సుమారు 4.25 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.48 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు.రహదారి నిర్మాణంలో కొన్ని ప్రాంతాల్లో ఎత్తు పెరగడంతో విద్యుత్ అధిక వోల్టేజ్ తీగలను మార్చాల్సిన అవసరం ఏర్పడిందని, ఇందుకు అదనంగా రూ.2 నుంచి రూ.3 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే కాలువల వద్ద భవిష్యత్తులో నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా అదనపు కల్వర్టులు నిర్మించాల్సి ఉందని తెలిపారు.పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరణభవిష్యత్తులో ఇన్నర్ రింగ్ రోడ్డును కొత్తగా నిర్మించనున్న రైల్వే వంతెన మీదుగా పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరించేందుకు ప్రతిపాదన చేసినట్లు పెమ్మసాని తెలిపారు. ఈ విస్తరణతో పల్నాడు ప్రాంతం నుంచి వచ్చే ప్రజలకు అమరావతికి మెరుగైన రహదారి అనుసంధానం అందుబాటులోకి వస్తుందని చెప్పారు.ఈ విస్తరణకు సుమారు రూ.15 నుంచి రూ.20 కోట్ల అదనపు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నామని, ముఖ్యమంత్రికి ఇప్పటికే లేఖ రాసినట్లు తెలిపారు.
ఇన్నర్ రింగ్ రోడ్ పూర్తయితే గుంటూరు నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పెమ్మసాని పేర్కొన్నారు. గుంటూరు, అమరావతి, పల్నాడు ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం కల్పించేలా పనులను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు.

# నీట్ పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

## రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 29:**
జిల్లాలో ఆగస్టు 30న నిర్వహించే నీట్ పీజీ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి అధికారులను ఆదేశించారు.జిల్లాలో ఆరు కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులను ఉదయం 7 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు.నిషేధిత ఎలక్ట్రానిక్ పరికరాలు, చిట్టీలు, కాగితాలు తదితరాలను కేంద్రాల్లోకి అనుమతించరాదన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా, సైబర్ భద్రత, వైద్య సేవలు, రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలోని జిరాక్స్, అంతర్జాల కేంద్రాలను పరీక్ష సమయంలో మూసివేయించాలని, కేంద్రాల్లో శాంతిభద్రతలు కాపాడేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# రోజుకు 150 వీధి కుక్కలకు ఏబీసీ శస్త్రచికిత్సలు కమిషనర్ కె.మయూర్ అశోక్

**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 29:**
గుంటూరు నగరంలో వీధి కుక్కల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. శనివారం పొన్నూరు రోడ్డులోని ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు.
సెంటర్‌లో కుక్కలకు అందుతున్న వైద్య సేవలు, శస్త్రచికిత్సలు, ఆపరేషన్ థియేటర్ల పరిశుభ్రత, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ప్రతిరోజూ కనీసం 150 వీధి కుక్కలకు ఏబీసీ శస్త్రచికిత్సలు, యాంటీ రేబీస్ వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.
శస్త్రచికిత్సల సంఖ్యకే ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రక్రియ మొత్తం నిర్వహించాలని స్పష్టం చేశారు. శస్త్రచికిత్స అనంతరం కుక్కలకు తగిన విశ్రాంతి, పోషకాహారం, వైద్యం, పర్యవేక్షణ అందించి పూర్తిగా కోలుకున్న తర్వాత అవి పట్టుబడిన ప్రాంతాల్లోనే సురక్షితంగా వదిలిపెట్టాలని తెలిపారు.
కుక్కలను సురక్షితంగా తరలించేందుకు అవసరమైన అదనపు వాహనాలను కాంట్రాక్ట్ ఏజెన్సీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.





ఏబీసీ సెంటర్‌లో నిర్మాణ పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని, కాంపౌండ్ వాల్, ప్రధాన గేటు నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు.నగర రోడ్లపై ఆవులు, ఎద్దులు తిరగకుండా చర్యలు తీసుకోవాలని, పట్టుబడిన వాటిని గోశాలకు తరలించి యజమానులకు జరిమానా విధించాలని కమిషనర్ స్పష్టం చేశారు.అనంతరం కేవీపీ కాలనీలో అనుమతులు లేకుండా రోడ్డు తవ్వి కేబులింగ్ చేసిన ఏజెన్సీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేసి, వారితోనే రోడ్డు పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. నగరంలో కేబుల్ లైన్ల కోసం రోడ్డు తవ్వాలంటే తప్పనిసరిగా జీఎంసీ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఏసీపీ జకిరా, వీఏఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# అరణ్యారామంలో వృక్షాల తరలింపు పనుల పరిశీలన హరిత సమాజం అధ్యక్షుడు కొణిదెల నాగేంద్రబాబు



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 29:**
అరణ్యారామం ప్రాంతంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆంధ్రప్రదేశ్ హరిత సమాజం అధ్యక్షుడు కొణిదెల నాగేంద్రబాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ చేపడుతున్న వృక్షాల తరలింపు ప్రక్రియను పరిశీలించారు.అభివృద్ధి పనుల సమయంలో అక్కడి వృక్షాలను పరిరక్షిస్తూ, వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అటవీ శాఖ చేస్తున్న కృషిని నాగేంద్రబాబు అభినందించారు. ఇప్పటివరకు అరణ్యారామం ప్రాంతం నుంచి 45 చెట్లను విజయవంతంగా తరలించినట్లు అధికారులు తెలిపారు.అనంతరం అరణ్యారామం నమూనా ప్రణాళికలు, ప్రతిపాదిత అభివృద్ధి పనులను వివరిస్తున్న చిత్ర ప్రదర్శనను ఆయన సందర్శించారు. నందనవనం ప్రాంతంలో వేప, రావి చెట్లను కలిపి నాటారు.ఆంధ్రప్రదేశ్ హరిత సమాజం కార్యక్రమాలకు సామాజిక బాధ్యత నిధులను సమీకరించే అంశంపై అటవీ శాఖ అధికారులతో నాగేంద్రబాబు చర్చించారు. రాష్ట్రంలో 50 శాతం హరిత విస్తీర్ణం సాధించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు పరిశ్రమలు, ఇతర భాగస్వామ్య వర్గాలు




చురుకుగా భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు డా. పి.వి. చలపతి రావు, బి.ఎన్.ఎన్. మూర్తి, వై. శ్రీనివాసులు రెడ్డి, ఎన్. నాగేశ్వరరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సమస్యలకు సత్వర పరిష్కారం

## జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ

**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 29:**
వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందించడంలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్‌లో శనివారం వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్, ఆరోగ్యం, ధ్రువపత్రాలు తదితర సమస్యలపై అర్జీలను కలెక్టర్‌కు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి సమస్యలను ప్రత్యేకంగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.





# తప్పులు లేని ఓటరు జాబితానే లక్ష్యం ఎస్.ఐ.ఆర్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంతప్పులు లేని ఓటరు జాబితానే లక్ష్యం ఎస్.ఐ.ఆర్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 29:**
తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడమే ఎస్.ఐ.ఆర్ ప్రధాన లక్ష్యమని జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు రోణంకి కూర్మనాథ్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో ఇప్పటివరకు పొన్నూరు, తెనాలి మినహా అన్ని నియోజకవర్గాల్లో పర్యటించినట్లు తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఏ విధంగా పనిచేస్తున్నారో, అదే స్థాయిలో బూత్ స్థాయి ఏజెంట్లు కూడా చురుకుగా పనిచేయాలని సూచించారు.
జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ మాట్లాడుతూ జిల్లాలో 1,68,218 ఎస్.ఐ.ఆర్ నోటీసులు జారీ చేయగా, 1,07,427 కేసుల విచారణ పూర్తయిందని తెలిపారు. మరో 12,596 నోటీసులకు విచారణ తేదీలను తిరిగి కేటాయించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 742 మందిని అర్హత లేనివారిగా గుర్తించినట్లు





వివరించారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటరు జాబితాను పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫారం6 దరఖాస్తులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, ఫారం7 ద్వారా తొలగించిన ఓటర్ల వివరాలను అందించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు.సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, ఆర్డీవోలు, ఈఆర్వోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక పరిజ్ఞానంతో మహిళా సాధికారతకు కొత్త దిశ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ,పెన్ పవర్,ఆగస్టు 29:**
మహిళలు వ్యాపారాలను ప్రారంభించడమే కాకుండా, వాటిని విజయవంతంగా నిర్వహించేందుకు ఆర్థిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యాపార నిర్వహణ, పన్నులు, జీఎస్టీ, ప్రభుత్వ రాయితీలు, రుణ సదుపాయాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు.ఆదాయాన్ని సమర్థంగా నిర్వహించడం, ఖర్చులను నియంత్రించడం, పొదుపు చేయడం, భవిష్యత్ అవసరాలకు ప్రణాళిక రూపొందించడం ద్వారా వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. డిజిటల్ లావాదేవీల నేపథ్యంలో మహిళలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, రైజ్ మేనేజర్ బి.తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానం ఉద్యమంలో పాల్గొనండి దృష్టి సందేశ దాత అవ్వండి జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 29 :**
జాతీయ నేత్రదాన పక్షోత్సవాలులో భాగంగా పోస్టర్ లను శనివారం జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదానం గురించి, ప్రతి వీధిలో, ప్రతి ఊరిలో, ప్రతి సమాజ సంక్షేమ సమితిలో అన్నివిధాలా ప్రచారం చేయాలని కోరారు. ప్రజలకు చెప్పడం వల్ల ఈ ఉద్యమానికి మద్దతు లభిస్తుందన్నారు. నేత్ర దానం చేయడం ద్వారా మరణించిన అనంతరం కూడా ప్రపంచాన్ని మీ కళ్ళు చూస్తాయని అన్నారు. కళ్ళజోడు పెట్టుకొనేవారు, మధుమేహం, అధిక బ్లడ్ ప్రెషర్, ఉబ్బసం వ్యాధులతో బాధపడేవారు కూడా నేత్రదానం చేయవచ్చన్నారు. కంటి శుక్లాల (కెటరాక్ట్) ఆపరేషన్ చేయించుకొన్నవారు కూడా నేత్రదానం చేయవచ్చని తెలిపారు. ఒకరు నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికి కంటి చూపు లభిస్తుందని చెప్పారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి మాట్లాడుతూ మరణించిన 6 గంటల లోపు నేత్రాలను తీయవలసి ఉంటుందన్నారు. సకాలంలో నేత్రదానం జరిగేలా చూడటంలో ముఖ్య భూమిక నిర్వహించాలన్నారు. మరణించిన వ్యక్తి తన నేత్రాలను దానం చేస్తున్నట్టు ఇదివరకే ప్రతిజ్ఞ చేసినా, చేయకపోయినా సరే, ఆ కుటుంబం వారి అనుమతితో కూడా కళ్ళను తీసుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, అంధత్వ నివారణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

